క్లుప్తంగా

రేపటి నుంచి తపాలశాఖ వారోత్సవాలు

తిరుపతి అర్బన్: తపాలాశాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కే.ఆర్ముగం తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సోమవారం నుంచి 11వ తేది వరకు తపాలాశాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 10న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి హెడ్‌పోస్ట్ ఆఫీస్, రేణిగుంట సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సేవలు అందుబాటులో ఉంటాయని, ఈ నెల 11న తపాలా జీవిత బీమా, పొదుపు ఖాతాలకు సంబంధించి అన్ని తపాలా కార్యాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మద్యం సిండికేట్‌కు అవకాశం లేదు

తిరుపతి రూరల్: మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎక్కడా సిండికేట్‌కు అవకాశమే ఉండదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తిరుపతి రూరల్ సీఐ ఏలూరు నరసానాయుడు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రూ.2 లక్షల నాన్-రిఫండబుల్ డీడీని తీసుకువచ్చిన వారు మాత్రమే దరఖాస్తు చేయడానికి అవకాశం ఉందన్నారు. తిరుపతి రూరల్ మండలంలో 12, రేణిగుంట మండలంలో 10 మొత్తం 22 షాపులు కేటాయించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 13 దరఖాస్తులు వచ్చాయన్నారు. రూరల్ ఎస్ఐ వీకే నాయుడు పాల్గొన్నారు.

నిరంతర వైద్య విద్యపై అవగాహన

తిరుపతి తుడా: స్విమ్స్ ఆసుపత్రిలో అనస్తీషియా, కార్డియాలజీ, సిటీ సర్జరీ విభాగాల ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు శనివారం నిరంతర వైద్య విద్య అవగాహన కల్పించారు. కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు జీఆర్ వర్మ, డాక్టర్ పీ వరుణ్, డాక్టర్ శ్రీరామ్, సిటీ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు హేమచంద్ర, చిరంజీవి, అనస్తీషియా ప్రొఫెసర్ పి.హేమలత పలు ముఖ్యమైన అంశాలను విశదీకరించారు. కార్యక్రమంలో కార్డియాలజీ విభాగాధిపతి రాజశేఖర్, సిటీ సర్జరీ విభాగాధిపతి సత్యవతి, అనస్తీషియా విభాగాధిపతి అలోక్ సమంత్‌రే పాల్గొన్నారు.

క్రీడల్లో స్విమ్స్ వర్సిటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, డైరెక్టర్

తిరుపతి సిటీ: ఏర్పేడు ఐఐటీ వేదికగా శాన్‌యోగ్-2024 పేరుతో ఐదు రోజులుగా నిర్వహించిన అథ్లెటిక్, టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీల్లో స్విమ్స్ విద్యార్థులు సత్తా చాటి పలు విభాగాల్లో ఛాంపియన్లుగా నిలిచారని వీసీ, డైరెక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ స్విమ్స్ వర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, అల్లాడి హెల్త్ సైన్సెస్ విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారని తెలిపారు. క్రీడలతో మానసిక, శారీరక ఆనందానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాళ్లు సుధారాణి, కుమారి, మధుబాబు, స్విమ్స్ స్పోర్ట్స్ బోర్డు సుభాష్, పీడీ మధుబాబు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

తిరుపతి అర్బన్ : దోపిడీలు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై రౌటీ షీట్ ఓపెన్ చేస్తామని తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ హెచ్చరించారు. ఆయన శనివారం తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 1న తిరుపతిలోని గరుడా సర్కిల్, చెర్లోపల్లి రోడ్డు, అరవింద్ కంటి ఆస్పత్రి సమీపంలో జరిగిన దోపిడీలకు పాల్పడిన పెనుకొండ వెంకటేష్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. అతని నుంచి రూ.18 వేల సెల్‌ఫోన్, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసిన వెస్ట్ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణ, ఎస్ఐ బాలక్రిష్ణయ్య, ఎంవీ అనీల్‌కుమార్, ఏఎస్ఐలు సురేంద్ర, షణ్ముగం, హెడ్‌కానిస్టేబుల్స్ వెంకటేశ్వరావు, రాము, కానిస్టేబుల్స్ గోపీనాథ్, రమేష్‌ను డీఎస్పీ అభినందించారు.

నిస్సాన్ సరికొత్త మ్యాగ్నెట్ కారు ఆవిష్కరణ



మ్యాగ్నెట్ కారును ఆవిష్కరిస్తున్న నిస్సాన్ ఎండీ జగన్నాథరెడ్డి

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డులోని హైటెక్ నిస్సాన్ షోరూంలో శనివారం సాయంత్రం నిస్సాన్ సరికొత్త మ్యాగ్నెట్ కారును ఎండీ జగన్నాథరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ కారులో అత్యాధునిక ఫ్యూచర్స్ ఉన్నాయని తెలిపారు. ఇందులో అమర్చిన 1.0 లీటర్ టర్బ్ చార్జెడ్ పెట్రోల్ ఇంజిన్ 98 బీహెచ్‌పీ, 160 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుందన్నారు. హై స్పీడ్ మాన్‌వెల్ ట్రాన్సిమిషన్, సీవీటీ గేర్ బాక్స్, 6 ఎయిక్ బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, టీల్ స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెజర్వ్ మానిటరింగ్ సిస్టం, ఈబీడీతో కూడిన ఏబీఎస్ ట్రాన్సెక్షన్ కంట్రోల్ తదితర ఫ్యూచర్స్ ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ సి.నిరంజన్, భారతి, హోషిమారెడ్డి, జనరల్ మేనేజర్ ఎన్‌వీఎస్.శాస్త్రి పాల్గొన్నారు.

అలంకార ప్రియునికి ప్రకృతి సొబగులు






వివిధ పుష్పాలు, ఆకులు, యాలకులు, రోస్ పెటల్స్, వట్టివేర్లు, ముత్యాలు, నల్ల-తెల్లద్రాక్ష, ఎరుపు పెటల్స్, మల్లె, రోజా మొగ్గలతో తయారు చేసిన ప్రత్యేక కిరీటాలు

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. స్వామికి వైఖానస ఆగమోక్తంగా పూటకో అలంకరణ చేస్తారు. రంగనాయక మండపంలో శనివారం స్వామి, అమ్మ వార్లకు స్నపన తిరుమంజనాన్ని ఘనంగా చేపట్టారు. శ్రీవిల్లి పుత్తూరు నుంచి మొదటిసారి తీసుకువచ్చిన చిలకలు, వివిధ పుష్పాలు, ఆకులు, యాలకులు, రోస్ పెటల్స్, వట్టివేర్లు, ముత్యాలు, నల్ల-తెల్లద్రాక్ష, ఎరుపు పెటల్స్, మల్లె, రోజా మొగ్గలతో తయారు చేసిన ప్రత్యేక కిరీటాలు, మాలలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వాటి తయారీలో ఉద్యానవనశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులు జాగ్రత్తలు తీసుకున్నారు. అంతకుముందు తిరుమల పెద్ద జీయంగార్, తిరుమల చిన్నజీయంగార్ పాశురాలను పఠించారు. వేద పారాయణదారులు వేదాలను పారాయణం చేశారు.



చిలకలను చూపుతున్న టీటీడీ అధికారి






విశేషంగా ఆకట్టుకుంటున్న కిరీటాలు, జడ, మాలలు

బ్రహ్మోత్సవాల్లో నేటి వాహనాలు

తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామి చిన్నశేష వాహనంపై మురళీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి మలయప్ప స్వామి హంస వాహనాన్ని అధిరోహించి సరస్వతిదేవి రూపంలో భక్తులను కటాక్షించారు. మూడో రోజు ఆదివారం ఉదయం మలయప్పస్వామి సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

సింహ వాహనం ప్రత్యేకత

శ్రీవారి దశావతారాల్లో నాలుగవది నరసింహావతారం. సింహం బలానికి(వహనశక్తి), వేగానికి(శీఘ్రగమన శక్తి) నిదర్శనం. భక్తుడు సింహబలం అంతటి భక్తి బలం కలిగినప్పుడు భగవంతుడు అనుగ్రహిస్తాడని వాహన సేవలో అంతరార్థం.

ముత్యపుపందిరి వాహనం

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఆదివారం రాత్రి స్వామివారు ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఆదిశేషుని పడగలను ముత్యాల గొడుగుగా పూనిన స్వామివారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాల కింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుందని ప్రతీతి.

గొడుగుల ఊరేగింపులో కానుకలు ఇవ్వొద్దు

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడ సేవ రోజు అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు కానుకలు ఇవ్వరాదని టీటీడీ విజ్ఞప్తి చేసింది. భక్తులు అందించే కానుకలు టీటీడీకి చేరవని పేర్కొంది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో పలు హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకొచ్చి స్వామివారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని వెల్లడించింది. ఈ గొడుగులు అక్టోబరు 7న తిరుమలకు చేరుకుంటాయి.

భక్తులతో పోటెత్తిన అలిపిరి




అలిపిరి పాదాల మండపం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పేరటాసి మాసం మూడో శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం శ్రీవారి దర్శనం కోసం కాలినడకన తిరుమల బయలుదేరారు. వారికి స్థానికులు పులిహోర, పెరుగన్నం అందజేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

కల్యాణ వెంకన్న ఆలయం కిటకిట



తిరుచ్చిపై దర్శనిమస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: పెరటాసి మాసం మూడవ శనివారం కావడంతో శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు కల్యాణం చేశారు. వివాహం కాని యువతీ, యువకులు కంకణాలు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం స్వామి వారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. ఆలయ ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు జడ్జి



చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శనివారం రాత్రి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్.చక్రవర్తి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలతో సత్కరించారు.

ముగిసిన శిక్షణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎంబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థినులకు ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, నాన్డీ ఫౌండేషన్ సంయుక్తంగా వారం రోజులు ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. విద్యార్థినుల కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఇంటర్వ్యూ టెక్నిక్స్, గ్రూప్ డిస్కషన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రొఫెసర్ విజయలక్ష్మీ సర్టిఫికెట్లు అందజేశారు.

గాయత్రీదేవి అలంకరణలో గంగమ్మ





గాయత్రీదేవి అలంకరణలో శక్తి చాముండేశ్వరి, తిరుపతి గంగమ్మ, గజవాహనంపై మూలస్థాన ఎల్లమ్మ

తిరుపతి కల్చరల్/రామచంద్రాపురం/చంద్రగిరి/భాకరాపేట/తిరుపతి రూరల్ : దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లోని అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

- తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక పూజలు, దేవీ హోమం, సహస్ర నామార్చన చేశారు. సాయంత్రం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.
- రామచంద్రాపురం మండలం రాయలచెరువు కట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో వెలసిన దుర్గాదేవి ధూమావతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకులు సిద్దేశ్వరానంద భారతీ స్వామి, మాతాజీ రమ్యానంద భారతి ప్రత్యేక పూజలు, హోమం చేశారు.
- చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూస్థాన ఎల్లమ్మ గజలక్ష్మీగా భక్తులను కటాక్షించారు. అలాగే పుట్టాలమ్మ ఆలయంలో ఉన్న సంతోషి మాత అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు.
- చిన్నగొట్టిగల్లు చెరువుకట్ట మీద వెలసిన తిరుపతి గంగమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి, మాణిక్యాంబదేవి, యడమవారి పల్లెలోని కృష్ణప్రియ ద్రౌపది, భాకరాపేట శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి, ముత్యాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
- తిరుపతి రూరల్‌లోని తుమ్మలగుంటలోని శ్రీశక్తి చాముండేశ్వరి దేవి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

గాయత్రీదేవిగా కరిమారియమ్మ

పేరూరు స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలోని కరిమారియమ్మ శనివారం గాయత్రి దేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ ధర్మకర్త దామినేటి కేశవులు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పాల రాష్ట్ర అధ్యక్షుడిగా శరత్ రాఘవేంద్ర



శరత్ రాఘవేంద్రను సత్కరిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (పాల) రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానిక్ విభాగపు లెక్చరర్ శరత్ రాఘవేంద్ర ఎన్నికయ్యారు. గత నెల 30న ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనను శనివారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, ఏఓ గురివిరెడ్డి, రిటైర్డ్ సూపరింటెండెంట్ డీ.ఆనందరావు ఘనంగా సత్కరించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



తిరుపతి క్రైమ్: నగరంలోని శ్రీనివాస్ సేతు పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ రామకిషోర్ కథనం మేరకు.. సుమారు 25 ఏళ్లున్న యువకుడు లీలామహల్ నుంచి కపిలతీర్థం వైపు వెళ్లే శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ పైనుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కాకీ ప్యాంటు, ఎర్ర టీ షర్టు ధరించి ఉన్నాడు. మద్యం మత్తులో దూకి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఘనంగా అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం

తిరుపతి సిటీ: ఇస్రో, షార్ సంయుక్తంగా శనివారం పద్మావతి మహిళా వర్సిటీలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా ప్రారంభించాయి. షార్ సీనియర్ సైంటిస్ట్ మూర్తి మాట్లాడుతూ ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 4 నుంచి 10వ తేదీ వరకు సాధారణ ప్రజలు, విద్యార్థులకు స్పేస్, క్లైమేట్ చేంజ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, స్పేస్ ప్రాజెక్ట్ నమూనా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ మల్లికార్జున, రిజిస్ట్రార్ రజనీ, డీన్ కాత్యాయని, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

చంద్రగిరి: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని తిరుపతి 4వ అదనపు జిల్లా జడ్జి అర్చన తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చట్టాలు, మహిళల హక్కుల గురించి తెలుసుకుంటే ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఏపీఎం గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ

తిరుపతి కల్చరల్: పెరటాసి మూడో శనివారం సందర్భంగా సరోజినీదేవి రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి ఆలయం వద్ద కాలినడకన తిరుమల వెళ్లే భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కేఎల్.వర్మ అన్నప్రసాదాల పంపిణీని ప్రారంభించారు. నిర్వాహకుడు ఆర్ఆర్.శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ మురళీ, రాధాకృష్ణ వర్మ, ఎస్‌బీఐ లీలామహల్ బ్రాంచ్ మేనేజర్ రాజానరేస్, సుజాత, పవన్, విష్ణు పాల్గొన్నారు.

మా ఇంటిని కానిస్టేబుల్ కబ్జా చేశాడు!

చంద్రగిరి: నకిలీ పత్రాలను సృష్టించి కానిస్టేబుల్ మా ఇంటిని కబ్జా చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితుడు విజయ్‌కుమార్ వాపోయారు. ఆయన శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తాము 2012లో తిరుచానూరు పంచాయతీ యోగిమల్లవరం సర్వే నంబర్ 260లోని 50 అంకణాల ప్లాటును లలితకుమారి నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. రేకుల ఇంటిని నిర్మించి బాడుగకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈస్టు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సాంబయ్య 1982కు సంబంధించిన రూ.5 స్టాంప్ పేపర్లను స్టాంప్ వెండర్ సిద్ధారెడ్డి దగ్గర కొనుగోలుచేసి, రిజిస్టర్ చేయని డాక్యుమెంట్‌ను సృష్టించాడని ఆరోపించారు. అలాగే 2004 నుంచి 2012 వరకు తమ పేరుతో ఉన్న కరెంటు మీటర్లను తొలగించి, తన పేరు మీద కొత్త మీటర్లను ఏర్పాటు చేసుకున్నాడని తెలిపారు. ఆ ఇంట్లో 11 ఏళ్లుగా ఉంటూ నరకయాతనకు గురిచేస్తున్నాడని వాపోయారు. దీనిపై ఎస్పీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ

- కల్యాణ వెంకన్నకు సారె సమర్పణ
- 17 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం
- గ్రామీణులకు స్వాగతం పలుకుతున్న చెవిరెడ్డి



కల్యాణ వెంకన్నకు సారె తీసువస్తున్న పాకాల మండల వాసులు



సారెతో మంగళం పంచాయతీ ప్రజలు

తిరుపతి రూరల్: పెరటాసి మాసంలో చంద్రగిరి నియోజకవర్గంలోని పల్లెల్లో ఆధ్యాత్మిక పండుగ వాతావరణం నెలకొంటోంది. తుమ్మలగుంట కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రజలు సారె సమర్పించి భక్తిని చాటుకుంటున్నారు. వారు నుదుటున తిరునామం పెట్టుకుని.. గుండెల నిండా అపారమైన భక్తిని నింపుకుని.. తమ శక్తి కొద్దీ పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, ఆకులు, వక్కలు, కొబ్బరికాయలు, వస్త్రాలు, పూజ సామగ్రి తీసుకుని తలపై పెట్టుకుని గోవిందా.. గోవిందా అంటూ తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి చెంతకు తెచ్చి.. స్వామికి సమర్పిస్తున్నారు. ఆలయ ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గ్రామ శివారులో వారికి స్వాగతం పలుకుతున్నారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను తిరుమల తరహాలో నిరాటంకంగా 17 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజల్లో భక్తి భావాన్ని పెంచడానికి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సరికొత్త సంప్రదాయాన్ని తీసుకువచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్క వాహనానికీ పది పంచాయతీల నుంచి సారెను తీసుకువచ్చేందుకు అవకాశం కల్పించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం నుంచి ఉదయం, రాత్రి వేళల్లో జరిగే వాహన సేవలకు ముందు సారెను సమర్పించేలా చర్యలు తీసుకున్నారు. ఏ రోజు ఏ వాహనానికి ఎవరు సారె తీసుకురావాలో ముందుగానే షెడ్యూలు ప్రకటిస్తున్నారు. దీంతో చంద్రగిరి నియోజకవర్గంలోని పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, తిరుపతి రూరల్, రామచంద్రాపురం, తిరుపతి అర్బన్ మండలాల పరిధిలోని శ్రీవారి భక్తులు పెద్ద ఎత్తున సారె తీసుకుని తుమ్మలగుంటకు చేరుకుంటున్నారు. వారికి ఆలయం తరఫున చెవిరెడ్డి గ్రామ శివార్లకు ఎదురేగి స్వాగతం పలికి భజన బృందాలు, కళాకారులు, మంగళ వాయిద్యాలు నడుమ సారెను ఆలయం వద్దకు తీసుకువెళ్లి స్వామికి సమర్పించేలా చూస్తున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు. తిరుమలలో ఎలాగో స్వామి వారికి సారెను సమర్పించలేమన్న ఆలోచనతో వందలాది మంది భక్తులు తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరునికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు.